క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌లో చెట్లకు బహిరంగ వేలం

రామచంద్రపురం రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ రామచంద్రపురం డిపో పరిధిలోని మండపేట(ఏడిద రోడ్) బస్టాండ్‌లోని 5 టేకు చెట్లు, 2 నేరేడు చెట్లు, 5 వేప చెట్లు, 3 గానుగ చెట్లు, 7 జామాయిల్ చెట్లు, 1 రావి చెట్టు, 2 మారు జాతి చెట్లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.1,000 ధరావత్తుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఈ నెల 12 న సోమవారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించబడుతుందన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్లు 9958325536, 7382914010, 7382912083, 7382912064 లపై సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీల ప్రాధాన్యంపై అవగాహన

కపిలేశ్వరపురం: సన్ గ్రూప్, క్రై సంస్థ, ఆలమూరుకు చెందిన శ్రమ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10 వరకూ మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల ప్రాధాన్యం, తల్లీబిడ్డలకు పోషక విలువలున్న ఆహారం అందించాల్సిన అవసరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా మంగళవారం నేలటూరు, వల్లూరు, మాచర, వడ్లమూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కళాజాతా నిర్వహించారు. పాట, నాటిక, ఉపన్యాసం రూపాల్లో చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజలు పట్టం కట్టాలి


దుగ్గుదుర్రులో వాల్ రైటింగ్ బోర్డులను రాస్తున్న బీజేపీ నాయకులు

కాజులూరు: రానున్న ఎన్నికల్లో బీజేపీ సంస్థాగతంగా అభివృద్ధి సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ కోఆర్డినేటర్ దూడల శంకరనారాయణ అన్నారు.'ఆంధ్రలో ఒక్కసారి, కేంద్రంలో మరోసారి బీజేపీ సర్కార్' అనే నినాదంతో మంగళవారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు వాల్ రైటింగ్ బోర్డులను రాశారు. దుగ్గుదుర్రులో శంకరనారాయణ మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశం ప్రపంచంలో అత్యున్నత శక్తిగా ఎదగడమే కాకుండా ప్రజలకు సురక్షితమైన పాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంపన రాంబాబు, పాటిండి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

రాయవరం: రాయవరం శివార్లలో డబ్బులు పణంగా పెట్టి కోడి పందేలు నిర్వహిస్తున్న శిబిరంపై మంగళవారం దాడి చేసినట్టు స్థానిక ఎస్సై జి.నరేష్ తెలిపారు. ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రెండు కత్తులు, రూ.2,100 నగదు స్వాధీన పరుచుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల పెంపునకు కృషి చేయాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించడంతో పాటు పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంపునకు ప్రత్యేక కృషి చేయాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా గ్రామాల పీహెచ్‌సీల్లో మంగళవారం వైద్యారోగ్య, ఆశ సిబ్బందికి సమావేశం జరిగింది. ఆగస్టు నెలలో సాధించినవలసిన ప్రగతిని అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వివరించి ఆరోగ్య సేవలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి పాల్గొన్నారు.

ప్రైవేటు బోట్లలో ప్రయాణాలపై ఫిర్యాదు

సఖినేటిపల్లి: అంతర్వేదిలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా గుడికి వచ్చే భక్తులను గోదావరిలో విహరింపజేస్తున్న ప్రైవేటు వ్యక్తుల పర్యాటక బోట్ల ప్రయాణాలపై చర్యలు తీసుకోవాలని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, విజయవాడలోని ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ సీఈవోకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఫ్యాక్స్ ద్వారా పంపిన ఫిర్యాదు నకళ్లను మీడియాకు అందించారు. స్టీమర్‌రేవు, ఫిషింగ్ హార్బర్ ఏరియాల్లో ఏ విధమైన అనుమతులు లేకుండా కొంత మంది పర్యాటక బోట్లను ఏర్పాటు చేసుకున్నారన్నారు. విహారయాత్ర పేరుతో లక్ష్మీనృసింహుని దర్శనానికి వచ్చే భక్తులను విజిటింగ్ కార్డుల ద్వారా ఆకర్షించి, వారిని బోట్లలో ప్రయాణించే విధంగా నమ్మిస్తున్నారన్నారు. ఈ అనధికార పర్యాటక బోట్లకు సెక్యూరిటీ నామ్స్ లేవని, భక్తులతో రాకపోకలు సాగిస్తున్న ఈ బోట్లు గోదావరి మధ్యలో సాంకేతిక లోపాల వల్ల ఆగిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. అంతర్వేదిలో త్వరలో రానున్న స్వామి కల్యాణ మహోత్సవాలకు తరలి వచ్చే భక్తుల రక్షణకై తక్షణం వీటిపై ముందస్తు విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని నగేష్ ఆ ఫిర్యాదులో కోరారు.

మానవత్వమని పింఛేన్

- 'ఇంటికే పింఛన్' పథకానికి నాలుగేళ్లు
- ఆర్థిక సమస్యలను అధిగమిస్తూ దిగ్విజయంగా అమలు
- ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేలకు పెంపు

కపిలేశ్వరపురం: శరీరంలో సత్తువ లేదు... జీవనాధారమనుకునే స్థిరాస్తులు లేవు... కటుంబ సభ్యుల్లో ఎవరి బతుకు వారిది... ఇలాంటపుడు దేవుడే దిక్కు అనుకోవడం సహజం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వమే అన్నింటికీ ఆధారం. అధికారంలో ఉన్నవారు రాజ దర్పణాన్ని వెలగబెడితే పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతుంటారు. పేదలే నా దైవమని భావించే ప్రభుత్వముంటే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. అదే జరుగుతుంది నేడు ఆంధ్రప్రదేశ్‌లో. దేశంలో మరెక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను రూపొందించి లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికే వెళ్లి పింఛను అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఒకటి కాదు... రెండు కాదు.. నాలుగున్నరేళ్లుగా క్రమం తప్పకుండా లబ్ధిదారులనూ, సాయం సొమ్మునూ పెంచుకుంటూ అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. వలంటీర్ ఇంటికెళ్లి పింఛను డబ్బు అందజేసే విధానం ప్రారంభమై నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా ఈ కథనం.

పథకం నేపథ్యం ఇదీ..

గత ప్రభుత్వాల కాలంలో పేదవాడికి పింఛను మంజూరు కావడం ఓ ప్రహసనంగా ఉండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హతే ఆధారంగా పెద్ద సంఖ్యలో పింఛన్లు మంజూరు చేశారు. దానికి తోడు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి 2020 ఫిబ్రవరి 1 నుంచి అవ్వాతాతల ఇంటికే తీసుకెళ్లి పింఛను డబ్బులు ఇవ్వడం ప్రారంభించారు.

లబ్ధిదారులు, పంపిణీ మొత్తం పెరుగుతూనే ఉన్నారు

మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాల్లో 2019–20లో 10,094 మందికి రూ.6,09,35,250 పంపిణీ చేయగా 2020–21లో 10,779 మందికి రూ.9,49,72,970 పంపిణీ చేశారు. 2021–22లో 10,908 మందికి రూ.8,98,91,550 ఇవ్వగా


లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న వలంటీర్

2022–23లో 11,394 మందికి రూ.8,82,04,250 పంపిణీ చేశారు. 2024 జనవరి ఒక్క నెలలో 12,097 మందికి రూ. రూ.3,35,59,250 పంపిణీ చేశారు.

మండపేట పట్టణంలోని 30 వార్డుల్లో 2019–20లో 5,825 మందికి రూ.6,02,31,000 పంపిణీ చేయగా 2020–21లో 6,019 మందికి రూ.8,97,11,500 పంపిణీ చేశారు. 2021–22లో 6,198 మందికి రూ.7,64,27,250కి ఇవ్వగా 2022–23లో 6,326 మందికి రూ.10,09,01,150 పంపిణీ చేశారు. 2023–24లో 6,693 మందికి రూ.9,28,43,250, 2024 జనవరి ఒక్క నెలలో 6,943 మందికి రూ.1,92,63,250 పంపిణీ చేశారు.

నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ ఇలా...

మండలం	సచివాలయాలు	పింఛన్లు	నగదు రూ. 2024 జనవరిలో
రామచంద్రపురం పట్టణం	12	4,563	1,27,22,000
రామచంద్రపురం రూరల్	21	10,753	2,86,99,750
కె.గంగవరం	23	10,185	2,72,47,250
మండపేట అర్బన్	14	6,943	1,92,63,250
మండపేట రూరల్	23	12,097	3,35,59,250
రాయవరం	19	10,146	2,74,63,250
కపిలేశ్వరపురం	20	10,300	2,77,77,000

రాయవరం మండలంలోని 12 గ్రామాల్లో 2019–20లో 8,131 మందికి రూ.5,21,65,935 పంపిణీ చేయగా 2020–21లో 8,897 మందికి రూ.7,02,17,500 పంపిణీ చేశారు. 2021–22లో 9,487 మందికి రూ.9,36,01,300కి ఇవ్వగా 2022–23లో 9,790 మందికి రూ.37,23,95,750, 2023–24లో 10,203 మందికి రూ.5,26,35,420 పంపిణీ చేశారు. 2024 జనవరి ఒక్క నెలలో 10,146 మందికి రూ. రూ.2,74,63,250 పంపిణీ చేశారు.

కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లో 2019–20లో 8,841 మందికి రూ.15,12,27,600 పంపిణీ చేయగా 2020–21లో 9,325 మందికి రూ.17,18,06,500 పంపిణీ చేశారు. 2021–22లో 9,613 మందికి రూ.19,95,85,020 కి ఇవ్వగా 2022–23లో 9,852 మందికి రూ.39,18,33,550 పంపిణీ చేశారు. 2023–24లో 7.020 మందికి రూ.24,20,73,000, 2024 జనవరి ఒక్క నెలలో 10,146 మందికి రూ. రూ.2,74,63,250 పంపిణీ చేశారు.

దూర ప్రాంతాలకు వెళ్లి..

కపిలేశ్వరపురం మండలం మాచరకు చెందిన లబ్ధిదారులు విశాఖ పట్టణం కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా సంబంధిత సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఖండవిల్లి వీరాంజనేయులు, వలంటీర్ వాసంశెట్టి కృష్ణార్జున్‌లు ఈ నెల 3న విశాఖ ఆసుపత్రికి వెళ్ళి రూ.3 వేల వితంతు పింఛను అందజేశారు. పడమర ఖండ్రికకు చెందిన లబ్ధిదారులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వెల్ఫేర్ అసిస్టెంట్ వి.నవీన్ ఆసుపత్రికెళ్ళి రూ.3వేల వితంతు పింఛను అందజేశారు. ఇలా నాలుగేళ్లలో ఎంతో మందికి లబ్ధిదారులకు సుదూర ప్రయాణం చేసి పింఛన్లును అందజేస్తూ వస్తున్నారు.

వెటకారం చేసిన వారే శభాష్ అన్నారు



వలంటీర్లను నియమించే ప్రక్రియ ప్రారంభమైన రోజుల్లో విపక్షాలు వలంటీర్ వ్యవస్థను వెటకారం చేశారు. ఇదేం జరిగే పని కాదని, అంతా హంగామా అంటూ చమత్కరించారు. ఎవరెన్ని అన్నా పట్టించుకోకుండా సేవా దృక్పథంతో వలంటీర్‌గా పింఛన్లను పంపిణీ చేస్తూ వస్తున్నాం. ఒకప్పుడు వెటకారం చేసినవారే ఇప్పుడు శభాష్ అంటున్నారు. – సుబ్రహ్మణ్యం, వలంటీర్, అంగర

తెల్లవారగానే ఇంటికొచ్చి ఇస్తున్నారు



నాకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే వృద్ధాప్య పింఛను మంజూరైంది. మూడేళ్లుగా వలంటీర్ విజయభారతి ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం ఆరు గంటలకే పింఛను డబ్బు ఇంటికి తెచ్చి ఇస్తుంది. ఇలాంటి పాలన వస్తుందని కలలో కూడా అనుకోలేదు. – వీధి రాముడు, ఏడిద కొత్తపేట, మండపేట మండలం

కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్నపై హర్షం


మండపేటలో కర్పూరీ ఠాకూర్‌కు నివాళి అర్పిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): తమ సామాజిక వర్గానికి చెందిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వడంపై మండపేట శ్రీరామా నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. రామాలయం వద్ద సంఘాధ్యక్షుడు బలగం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఠాకూర్ 100వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు కోదూరి శ్రీనివాసరావు, బలగం శ్రీనివాసరావు, రాజాన శ్రీనివాసరావు, అధ్యక్ష కార్యదర్శులు బలగం శ్రీనివాసరావు, చోడవరపు భాస్కరరావు, నాయకులు మల్లువలస శ్రీనివాసు, వెంకట్రావు, వైచర్ల మోహనకృష్ణ పాల్గొన్నారు.

వలంటీర్ భర్తకు చైర్‌పర్సన్ పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): రోడ్డు ప్రమాదానికి గురై శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మండపేట పట్టణం 20వ వార్డు వైఎస్సార్ కాలనీకి చెందిన వలంటీర్ సియాదుల సుశీల భర్త కుమార్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరామర్శించారు. కౌన్సిలర్ శెట్టి కల్యాణి, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, సచివాలయ కన్వీనర్లు గనిపే భూషణం, పేరూరి మాధవిలతో కలిసి మంగళవారం బాధితుడిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట గృహసారథులు పొడగట్లపల్లి పద్మ, పేనేడ్డి కృపావతి, యాదగని చంటి, గాజుల శ్రీను, పిల్లి శివ, మోర్తా లక్ష్మి, కొమ్మోజు నాగేశ్వరరావు, తేతలి సత్య, గుమ్ములేరు శ్రీను, వార్డు వలంటీర్లు ఉన్నారు.

అర్హతే ప్రాణికంగా సంక్షేమ పథకాలు


పట్టణంలోని 12వ వార్డులో గడప గడపకూ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు

- కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: దళారుల ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలనేదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని దానిని నెరవేర్చేందుకే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి పారదర్శకంగా సంక్షేమాన్ని అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో మంగళవారం సూర్యప్రకాశ్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ద్వారా పొందిన లబ్ధిని లబ్ధిదారులకు వివరిస్తూ ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత లబ్ధి పొందారనే విషయాలను వారికి లిఖిత పూర్వక పత్రాల ద్వారా తెలియజేశారు. లబ్ధిదారులు తమకు వివిధ ప్రభుత్వ పథకాలు నేరుగా తమ బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నాయని ఎటువంటి మధ్యవర్తులు, దళారులు లేకుండా సచివాలయ ద్వారా దరఖాస్తు చేసుకోవటంతో తాము లబ్ధి పొందుతున్నామని ఆనందం వ్యక్తం చేశారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయటం జరిగిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆడపడుచులు సంతృప్తిని పొందటం గొప్ప విషయమన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, సాంకేతిక పరమైన అంశాలు ఏమైనా ఉంటే పరిష్కరించి మిగిలిపోయిన లబ్ధిదారులకు కూడా పథకాలు అందించడం జరుగుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అందించని విధంగా ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళుతుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయన్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా సంక్షేమ పథకాలను ఆపలేరని సూర్యప్రకాశ్ స్పష్టం చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ, అమ్మ ఒడి, ఆసరా, పింఛన్, కాపు నేస్తం తదితర సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న తీరును అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్లు కేతా శ్రీను, నల్లా అంజమ్మ, కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు బంగారు బాబు, సత్తిశంకర్‌రెడ్డి, పోతంశెట్టి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలను రైతులకు చేరవేయడమే లక్ష్యం

అంబాజీపేట: జీవనియంత్రణ ప్రయోగాలను, పరిశోధనలను రైతులకు చేరవేసి ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యమని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ అఖిల భారత జీవనియంత్రణ సమన్వయ పథకం డైరెక్టర్ అండ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎన్.సుశీల్ అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సుశీల్ మాట్లాడుతూ ప్రయోగశాలలో చేపట్టిన పరిశోధనలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. జీవనియంత్రణ పద్ధతులను, వాటి ఉపయోగాలను రైతులకు వివరిస్తున్నామన్నారు. శాస్త్రవేత్తలు సూచనల మేరకు జీవనియంత్రణ, బదనికలను ఉపయోగించడం వల్ల ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు. కీటక విభాగంలో జరుగుతున్న పరిశోధనా ప్రగతిని, బదనికల ప్రయోగశాలను పరిశీలించారు. ప్రయోగశాలలో జరుగుతున్న ప్రగతిని పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు వివరించారు. అనంతరం స్థానిక పరిశోధన కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్న బదనికలు, జీవనియంత్రణ శిలింద్ర నాశినిలను సుశీల్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. నోడల్ అధికారి డా.జి.శివకుమార్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.శ్రీదేవి, కొవ్వూరు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ జి.రామానందంలు క్షేత్రస్థాయిలోను, ల్యాబ్‌లో జరుగుతున్న పరిశోధనలు, బదనికలను పరిశీలించారు. కార్యక్రమంలో తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త బి.నీరజ, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష, ఉద్యాన విభాగం శాస్త్రవేత్త ఎ.కిరీటి, రైతులు పాల్గొన్నారు.


రైతులకు బదనికలను అందిస్తున్న డైరెక్టర్ అండ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సుశీల్

రైతుల నుంచే మొదలుకావాలి


'వ్యవసాయ.. ఉద్యాన పరిశోధనా స్థానాలు.. ప్రభుత్వ.. ప్రైవేట్ ప్రయోగశాలలోనే కాదు.. రైతుల వద్ద నుంచే వ్యవసాయ, ఉద్యాన పరిశోధనాలు.. ప్రయోగాలు జరగాల్సి ఉంది' అని అఖిల భారత జీవనియంత్రణ సమన్వయ పథకం (ఏఐసీఆర్‌పీ ఆన్ బయోలాజికల్ కంట్రోల్) డైరెక్టర్ అండ్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఏ సుశీల్ అన్నారు. అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానాన్ని పరిశీలించేందుకు మంగళవారం వచ్చిన ఆయనను స్థానిక గోదావరి ఇంటిగ్రేటెడ్ ఫార్మర్స్ ట్రేడింగ్ అండ్ ప్రొడ్యూసర్ కంపెనీ (గిఫ్ట్) కంపెనీ చైర్మన్, ఏపీ వాటర్స్ యూజర్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, కంపెనీ డైరెక్టర్, వైఎస్సార్ యూనివర్శిటీ పాలకమండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. గిఫ్ట్ కంపెనీ అంబాజీపేటలో ఏర్పాటు చేసిన బయోలాజికల్ ల్యాబ్, రూగోస్ వైట్ ఫ్లై (తెల్లదోమ) నివారణకు అక్కడ ఉత్పత్తి అవుతున్న అపెర్టోక్రైసా ఆస్టర్ బదనికల గురించి వివరించారు. కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లను నివారించే బదనికలను కూడా గిఫ్ట్ కంపెనీ ఉత్పత్తి చేయాలని సుశీల్ కోరారు.

సూర్యప్రకాశ్‌కు నాయీబ్రాహ్మణుల మద్దతు


హసన్‌బాదలో సూర్యప్రకాశ్‌ను సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణ నాయకులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్‌కు రామచంద్రపురం పట్టణ నాయీబ్రాహ్మణ యువజన సేవా సంఘం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు కాజా జగన్నాథం ఆధ్వర్యంలో హసన్‌బాదలోని ఎంపీ పిల్లి సుభాష్‌చంద్ర బోస్ ఇంటి వద్ద సూర్యప్రకాశ్ కలసి సంఘ నాయకులు మద్దతు ప్రకటించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనలో ఎనలేని మేలు జరుగుతుందన్నారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సూర్యప్రకాశ్‌ను సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బల్లిపాటి జాని, సంయుక్త కార్యదర్శి వడ్డిపర్తి సతీష్, నాయకులు శ్రీను, మల్లవరపు రాంబాబు, ఉప్పాడ రాంబాబు, ఇనుకోటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చల్లా సేవలు అభినందనీయం


ఆలమూరులో చీరలు, దుప్పట్లను పంపిణీ చేస్తున్న ప్రభాకరరావు కుటుంబసభ్యులు

ఆలమూరు: పేద వర్గాల అభ్యున్నతి కోసం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు చేపడుతున్న సేవా సామాజిక కార్యక్రమాలు అభినందనీయమని రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు అన్నారు. ఆలమూరులో మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీ నేత ప్రభాకరరావు తన 60వ జన్మదినాన్ని పురస్కరించుకుని సుమారు రూ.రెండు లక్షల విలువైన చీరలు, దుప్పట్లు, దోవతులను పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 500 మంది పేదలకు పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు. అనంతరం పార్టీ నేతలు, గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. వేదనిధి బ్యాంకు చైర్మన్ జి.వివేకానందస్వామి, సలాది రామకృష్ణ, దియ్యన పెదకాపు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఉప సర్పంచ్ చల్లా సీతా మహాలక్ష్మి, చల్లా నానాజీ, రావూరి శివ, చల్లా భూషణం, ఎం.సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశే సీఎం లక్ష్యం


ఆర్యావటం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాజులూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పథకాలను రూపొందించి రాష్ట్రాన్ని సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. మంగళవారం ఆర్యావటంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో జెడ్పీటీసీ వెంకటసుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రుల్లో దివంగత సీఎం వైఎస్సార్ తర్వాత ప్రజల ఆరోగ్యం కోసం పరితపించిన వ్యక్తి సీఎం జగనన్న మాత్రమేనన్నారు. సీఎం జగనన్న సంక్షేమ పథకాలతో పాటు ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్సు సేవలు, ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్య సేవలు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ కంటి వెలుగు పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.సౌజన్య ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పలువురు నిపుణులైన వైద్యులు పాల్గొని సుమారు 350 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 32 మందికి మెరుగైన చికిత్స అవసరం కాగా వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ కురుపూడి సూర్యనారాయణ, స్పెషలిస్టు వైద్యులు యశ్వని, వెంకటరెడ్డి, సత్తిబాబు, సీహెచ్‌సీ వైద్యసిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యకర్త సుమలతకు సత్కారం

కపిలేశ్వరపురం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నుంచి సేవా పురస్కారాన్ని అందుకున్న అంగర 01 సచివాలయ వైద్య, ఆరోగ్య కార్యకర్త పెంకే సుమలతను ప్రభుత్వాధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అంగర పీహెచ్‌సీలో వైద్యాధికారి పీఎస్ఎస్‌డి రత్నకుమారి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పురస్కార గ్రహీతను ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, కార్యదర్శి టి.సుభాకర్ ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్యసేవలందించడంలో సుమలత సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్ఎస్ జిత్తుగ మల్లిఖార్జుడు, హెచ్ఈ బి.రామారావు, వైద్య,ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


అంగర పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్త సుమలతను సత్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

చేరికల పేరుతో టీడీపీ తప్పుడు ప్రచారం

- చైర్ పర్సన్ దుర్గారాణి
- 20వ వార్డులో పర్యటన

కపిలేశ్వరపురం: టీడీపీలో చేరారంటూ పట్టణంలోని ఆ పార్టీ నాయకులు చేస్తున్న హంగామా వల్ల అమాయకమైన పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, అదంతా తప్పుడు ప్రచారమని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. 20వ వార్డులోని కొందరిని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా టీడీపీ పట్టణ కార్యాలయంలోకి తీసుకెళ్లి పసుపు కండువాలు కప్పారని ఆమె అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం 20వ వార్డులో ఆమె పర్యటించారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆటోల్లో ఎక్కించి టీడీపీ కార్యాలయానికి తీసుకెళ్లి పసుపు కండువా కప్పారని షేక్ అమ్మాజీ వాపోయినట్టు చైర్‌పర్సన్ తెలిపారు. ప్రజలకు మంచి చేసి ఆకట్టుకోవాల్సిన రాజకీయ నాయకులు అమాయకులను మభ్యపెట్టి లేని బలాన్ని చూపుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దానివల్ల ఎలాంటి రాజకీయ ఫలితాలు టీడీపీకి దక్కవన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన సామాన్యులకు పింఛను రూపంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కనిపిస్తున్నారని, అలా సామాన్యులను ఆదుకున్న చరిత్ర టీడీపీ పాలనకు లేదని గుర్తు చేశారు. పట్టణంలో ఏ మూలకు వెళ్లినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాలూకు అభివృద్ధి, సంక్షేమం దర్శనమిస్తున్నాయని, ప్రజలకు దూరమైన టీడీపీ ఉనికిని చాటుకునేందుకు అవస్థ పడుతోందని ఎద్దేవా చేశారు. పర్యటనలో కాలనీ వాసులు ప్రస్తావించిన అంశాలను త్వరితగతిన పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శెట్టి కళ్యాణి, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, సచివాలయ కన్వీనర్లు గనిపే భూషణం, పేరూరి మాధవి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.


20వ వార్డు వాసులతో చైర్ పర్సన్ దుర్గారాణి